క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభంలో పాల్గొన్న బీజేపీ నేత సునీల్ దియోధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర కో ఇన్‌చార్జి సునీల్ దియోధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ వార్డులోని 277, 278 బూత్‌ల పరిధిలో ఓటర్లను వ్యక్తిగతంగా కలవాలని సూచించారు. విశాఖ కో ఆర్డినేటర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఎన్.విజయానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాలిమేర శ్రీనివాసరావు, దిలీప్ వర్మ, బాలరాజేశ్వరరావు, గొర్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ దేగాను సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులకు ఐఎన్ఎస్ దేగా పనితీరును వివరిస్తున్న నేవీ అధికారి

సింధియా: నగరంలోని విశ్వోదయ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులు, సిబ్బంది తూర్పు నావికాదళంలోని ఐఎన్ఎస్ దేగాను ఆదివారం సందర్శించారు. నేవల్ ఏవియేషన్ అధికారులు ఐఎన్ఎస్ దేగా అంతరభాగాన్ని చూపించడంతో పాటు జాతీయ సముద్ర ప్రయోజనాలను కాపాడడంలో ఐఎన్ఎస్ దేగా పాత్రను వివరించారు. దేగాలో ఉన్న వివిధ రకాల విమానాలను, నౌకాదళ విమానాల పాత్రలు, వాటి సామర్థ్యాన్ని తెలిపారు. వీటిలో పాటు ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ గైడెడ్ టూర్, ఎయిర్ సేఫ్టీ పరికరాల ప్రదర్శనను కూడా విద్యార్థులు సందర్శించారు.

సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు తిక్కవానిపాలెం కాలనీలోని సంపత్ వినాయక పార్వతీ విశ్వేశ్వర ఆలయ 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు గరికిన పరసియ్య, అధ్యక్షుడు మేడ గుర్రప్ప వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మేడ గుర్రప్ప, కోలా చంటి, వానపిల్లి అప్పన్న, గనగల్ల శంకర్, సింగిపిల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నలుగురి అరెస్ట్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేపట్టిన వారికి గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురిని మూడో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురు ఏయూ సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. తమకు ఆనందపురానికి చెందిన సాయి, గోవింద్, తూర్పు గోదావరికి చెందిన సంతోష్, శ్రీకాకుళానికి చెందిన సతీష్ గంజాయిని సప్లయ్ చేసినట్లు సెక్యూరిటీ గార్డులు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన మూడో పట్టణ పోలీసులు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

ఘనంగా బల్లల పండగ



మర్రిపాలెం రజకుల కాలనీలో బల్లల పండగలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్



జనతా కాలనీలో బల్లల పండగ పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు, స్థానికులు



గుల్లలపాలెంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య

గోపాలపట్నం: రజకుల కాలనీల్లో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ రజకుల కాలనీలో వాంబే గృహాల వద్ద జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రజకుల ఆరాధ్య దైవాలైన శివుడు, వీరభద్రుల చిత్రపటాలకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్, శ్రీధర్‌లను ఘనంగా సత్కరించారు. వీరు మాట్లాడుతూ రజకులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వారికి బల్లల పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

92వ వార్డులో..

జనతా కాలనీ పైడిమాంబ రజకుల సేవా సంఘం ఆధ్వర్యంలో బల్ల పండగ ఘనంగా జరిపారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పాల్గొని శివుడు, వీరభద్రులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, వూటపల్లి గోవిందు, సంఘ సభ్యులు సిహెచ్.గంగాధర్, వై.అప్పలరాజు, కె.కనకరాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గుల్లలపాలెంలో..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో ఆదివారం రజక సామాజిక వర్గ ప్రజలు బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్య పాల్గొని రజకుల పనిముట్లకు పూజలు చేశారు. తమ కుటుంబాలు బాగుండాలని ప్రతి ఏటా ఇక్కడ రజకులు బల్లల పండగను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. వారి కుల వృత్తి పనిముట్లను తాత్కాలిక మందిరం వద్ద ఉంచి వాటిని శుభ్రంగా నీటితో కడిగి, పసుపు రాసి పూజలు చేశారు. అక్కడ బల్లలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ వేడుకల్లో స్థానిక రజక సంఘం ప్రతినిధులు, సామాజిక వర్గ ప్రజలు పాల్గొన్నారు.

- మల్కాపురంలో పలువురు రజకలు బల్లల పండగను ఘనంగా జరుపుకొన్నారు.

మహనీయులు నడిచిన నేల విశాఖ నగరం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ



పాల్గొన్న రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు

ఎంవీపీ కాలనీ: నేటి ఆధునిక ప్రపంచానికి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన మహనీయుల నడిచిన నేల విశాఖపట్నమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. వారం రోజులుగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని విశాఖ నుంచి సద్గురు శివానందమూర్తి, ఎక్కిరాల కృష్ణమాచార్య, శ్రీభాష్యం అప్పలాచార్యులు వంటి మహనీయులు విశ్వవ్యాప్తం చేశారన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పేరున వెలసిన మహానగరంగా విశాఖపట్నం వర్ధిల్లుతోందని, దీనికి ఎంతో భవిష్యత్ ఉందని వెల్లడించారు. ప్రవచనాలు ముగిసిన అనంతరం షణ్ముఖశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల అనంతకృష్ణ, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, కేవీఎస్ శ్యామ్, అరుణ దంపతులు, శ్రీహరి సేవా బృందం కో-ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. జీవీ సురేష్, పి.కామేశ్వరి బృందం ఆలపించిన భక్తి సంగీతం అందరిని అలరించింది.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మోహన్‌కుమార్(ఫైల్)

గోపాలపట్నం: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి మహత్ కాలనీలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మహత్ కాలనీకి చెందిన భవిరిశెట్టి మోహన్ కుమార్(23) ఇంట్లో తన గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఐటీఐ ఎలక్ట్రికల్ చేసి కొన్నాళ్లు పని చేశాడు. ఆ తర్వాత ఒక మర్డర్ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. అప్పటి నుంచి పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అతనితో పాటు తల్లి ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తండ్రిలేడు. శనివారం రాత్రి 11 గంటలకు బయట నుంచి వచ్చి తన గదిలో పడుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా బయటకు రాకపోవడంతో తలుపులు తెరిచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. దీంతో ఘనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

విశాఖ ఉక్కు ఉద్యమంపై డాక్యుమెంటరీ



మాట్లాడుతున్న కేకే రావు

కూర్మన్నపాలెం: ఉక్కు రిలే నిరాహారా దీక్షలు ప్రారంభమై రెండేళ్లు పూర్తైన సందర్భంగా విశాఖ ఉక్కు ప్రాముఖ్యతను, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ విశాఖ ఉక్కు పేరుతో నిర్మించిన డాక్యుమెంటరీని వైజాగ్ యూట్యూబ్ చానల్‌లో కె.కె.రావు ఎక్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరం వద్ద ఆదివారం విడుదల చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న 731వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదలను పురస్కరించుకుని ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బోండా తవుడన్న, బాయ్యా మల్లయ్య, ఎల్‌వీ రమణ, ఎస్.సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు, ముప్పిడి రాజు, సత్యనారాయణ, బి.ఎస్.రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రావు మాట్లాడుతూ కార్మికులను, ఉద్యమ స్ఫూర్తిని, రెండేళ్లలో కార్మికులు చేస్తున్న పోరాట ప్రతిమను కొనియాడారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాలు ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేదిలేదన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు , ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫుట్‌బాల్ క్లబ్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన బ్లూస్టార్స్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ 12వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏయూ క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను భాగస్వాములను చేస్తూ బ్లూస్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ దశాబ్ద కాలంగా వందలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దిందని కొనియాడారు. క్లబ్ నిర్వాహకుడు, కోచ్ నరేష్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా 700 మంది వరకు యువతను ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. వీరిలో పది మంది వరకు జాతీయ స్థాయిలో రాణించారన్నారు. భవిష్యత్తులో మరింత మందిని అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యతో సమానంగా యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు సంస్థ కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వివిధ పోటీలలో సాధించిన ట్రోఫీలు, పతకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో గురుభక్తి చాటుకున్న పూర్వ విద్యార్థులు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ జోజిబాబు మరణించి ఈనెల 15వ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం పెద్ద ఎత్తున పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఫాదర్ జోజిబాబు వద్ద విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడిన వారు కొందరైతే.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారంటే అది జోజిబాబు తమకు అందించిన విద్య.. నేర్పిన క్రమశిక్షణేనని పేర్కొన్నారు. సేకరించిన రక్తాన్ని లైఫ్ షేర్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశామన్నారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని బిషప్ ఫాదర్ జయరాజు ప్రారంభించి పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు కొండ్ర రామకృష్ణ, కాశీభట్ల స్వరూప్, నక్కెళ్ల త్రినాథ్, కిలాని గణేష్, సీనియర్ పాత్రికేయుడు ఎస్ఎస్ శివశంకర్, లైఫ్ షేడ్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ శిరీష, మేనేజర్ అరుణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ



దివ్య సత్ ప్రసాదాన్ని అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు, చర్చి ఫాదర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠాధిపతులు (ఆర్చి బిషప్)డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవాళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్ష రసాన్ని భుజించమని చెప్పారన్నారు. దివ్యపూజ బలిలో సత్ ప్రసాదంలో సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా నూతనంగా దివ్య సత్ ప్రసాదాన్ని సుమారు 130 మంది చిన్నారులు స్వీకరించారు. అనంతరం జ్ఞానాపురంలోని వడిచర్లవీధి, స్లీవ్‌గుర్తు మండపం, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పీపీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భయం.. భయం

- శిథిలమైన జెడ్పీ హైస్కూల్ మండపం



ప్రమాదకరంగా ఉన్న గోపాలపట్నం జెడ్పీ హెచ్ స్కూల్ క్రీడా ప్రాంగణ మండపం

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉన్న మండపం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ భవనం వెనుక భాగంలో భారీగా పగుళ్లు ఏర్పడ్డాయి. అవి రోజు రోజుకూ పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు, మైదానానికి వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయంలో అధిక సంఖ్యలో స్థానికులు, క్రీడాకారులు, చిన్నారులు వస్తుంటారు. అలాగే ఈ మండపం వెనుక భాగంలోని శ్రీరామ్ నగర్ రోడ్డు రద్దీగా ఉంటుంది. ప్రమాదకరంగా ఉన్న భవనం ఎప్పుడైనా కూలితే భారీ నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి శిథిలమైన మండపాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి



స్వామిని దర్శించుకున్న బెహరా భాస్కరరావు, రమణకుమారి

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ఎస్సీబీసీ కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయ 22వ వార్షి కోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు గణపతికి విశేష పూలు, అర్చనలు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

స్వామిని దర్శించుకున్న నాయకులు

లక్ష్మీగణపతిని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణకుమారి సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, నీలాపు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన విరమించిన కార్మికులు

- జీవో రేటు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ అంగీకారం



రఫ్ సైట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ సంస్థ)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ ఆందోళన విరమించారు. జీవో రేటు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ సమ్మతించడంతో వారు ఎప్పటిలానే తమ విధులకు హాజరయ్యారు. ఈ సంస్థలో రెండేళ్ల నుంచి జరుగుతున్న విస్తరణ పనుల్లో ఓ భాగాన్ని రఫ్ అనే సంస్థ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడ పనిచేస్తున్న స్థానికేతర కార్మికుల(నార్త్ ఇండియన్స్)కు సదరు కాంట్రాక్టర్ పనికి తగ్గ వేతనాలను ఇవ్వక పోగా వారిచే అదనపు గంటలు పని చేయించుకుంటున్నారు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులు శుక్ర, శనివారాలు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ చర్యతో దిగివచ్చిన కాంట్రాక్టర్ లేబర్ యాక్ట్ ప్రకారం జీవో రేటు స్థానికేతర కార్మికులకు ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

వైభవోపేతం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణ నృత్య రూపకంలో కళాకారులు



శ్రీనివాసుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతమ్మధార: లోక కల్యాణార్థం శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం టీపీటీ కాలనీలోని ద్రవిడ సంక్షేమ సంఘం, శ్రీలలిత నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీరంగనాథచార్యులు, శ్రీసుబ్రహ్మణ్యాచార్యులు నేతృత్వంలో నిర్వహించిన కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు ఉదయ్‌కుమార్ సారథ్యంలో జరిగిన అన్నమయ్య సంకీర్తన వైభవం ప్రత్యేకంగా నిలిచింది. హరినాథ బృందం ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం భక్తులను మంత్రముగ్దులను చేసింది. పలువురు పాడిన సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ శ్రీనివాసుడి కల్యాణంలోని మధుర ఘట్టాలను తన వ్యాఖ్యానంతో ఆవిష్కరించారు.

తిరువీధి మహోత్సవం..

సీతమ్మధారలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నుంచి స్వామి వారి తిరువీధి మహోత్సవం ఘనంగా ప్రారంభించారు. లలితాదేవి కోలాటం, శ్రీగౌరీసాయి కోలాటం తదితర బృందాలు గోవింద నామస్మరణతో స్వామి వారి కల్యాణ వేదిక వరకు ఊరేగింపు సాగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ డా.జి.ఎస్.ఎన్.రాజు, ద్రవిడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎ.ఎస్.మూర్తి, కార్యదర్శి ఎస్.ఫణిస్వామి, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అధ్యక్షుడు ఎస్.కె.చంద్ర మౌళేశ్వరశర్మ, చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు రమణాచార్యులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ భక్తిశ్రద్ధలతో చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానర్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి వారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈఓ నరసింహరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సింహాచలేశుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు

ఘనంగా నిత్యకల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో అర్చకుడు పెదరాజు కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



నిత్యకల్యాణంలో ఉత్సవమూర్తులకు తలబ్రాలు పోస్తున్న అర్చకులు